
సాక్షి విశాఖపట్నం

బుధవారం । 1 । మే । 2024



పారిశ్రామిక ఒడి.. గాజువాక 10లో



మంచే సేసేడు.. మళ్లీ గెలుత్తాడు..! 10లో



దివ్యాంగుల క్రికెట్ టోర్నీ విజేత సెంట్రల్ జోన్ 8లో

న్యూస్‌రీల్

సార్వత్రిక ఎన్నికలకు వార్ రూమ్



ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి

విశాఖ సిటీ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఉత్తరాంధ్ర రీజియన్ పరిధిలో ఎన్నికల సూచనలు, సలహాల కోసం ఆయా పార్లమెంట్ నియోజకవర్గాలకు ప్రత్యేక వార్ రూమ్(సమాచార కేంద్రం) ఏర్పాటు చేసినట్లు రాజ్యసభ సభ్యుడు, ప్రాంతీయ సమన్వయకర్త వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఎండాడలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వార్ రూమ్‌ను ఓటర్లు, పార్టీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఆయా నియోజకవర్గ పార్లమెంట్ పరిధిలోని మొబైల్ నంబర్లను వెల్లడించారు.

విశాఖపట్నం 62818 95835
అల్లూరి సీతారామరాజు 73860 69369
అనకాపల్లి 80196 22677

అప్పన్న హుండీ ఆదాయం రూ.2.10 కోట్లు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి హుండీ ఆదాయం గత 35 రోజులకు గాను రెండు కోట్ల 10 లక్షల 60వేల 286 రూపాయలు వచ్చినట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరిపై యాత్రిక సదన్‌లో మంగళవారం స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. నగదుతో పాటు 104.100 గ్రాముల బంగారం, 15.450 కిలోల వెండి లభించినట్టు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన లెక్కింపులో దేవస్థానం ఉద్యోగులు, సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సన్మానం



ఏఆర్ ఏసీపీ మోహనరావును సన్మానిస్తున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ: నగర పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ముగ్గురికి పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఏఆర్ ఏసీపీ ఐ.మోహనరావు, కంచరపాలెం ట్రాఫిక్ ఏఎస్ఐ వై.రామారావు, ఏఆర్ హెచ్‌సీ పి.ఎస్.ఎ.నరసింహారావు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. వారిని సీపీ తన చాంబర్‌కు ఆహ్వానించి వారి కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారుల సమక్షంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా సీపీ పదవీ విరమణ పొందిన ముగ్గురి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పోలీస్ శాఖలో 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ సర్వీస్ చేయడం గొప్ప విషయమన్నారు.

నేడు ఎంపీ అభ్యర్థుల ఖర్చుల తనిఖీ

మహారాణిపేట: విశాఖ పార్లమెంట్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చులకు సంబంధించి బుధవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. అభ్యర్థులు నామినేషన్ వేసిన నాటి నుంచి మంగళవారం వరకు అకౌంట్స్ రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలు, రసీదులు, బ్యాంకు పాస్ పుస్తకంతో హాజరుకావాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున కోరారు. ఈ నెల 6, 11న మళ్లీ సమావేశాలు ఉంటాయన్నారు. భారత్ ఎన్నికల కమిషన్ నియమించిన వ్యయ పరిశీలకుడు అభ్యర్థుల ఖర్చులను తనిఖీ చేస్తారన్నారు.

5 నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- 11,220 మంది ఉద్యోగులకు రెండు రోజుల పాటు నిర్వహణ
- పోలీసులకు 7, 8 తేదీల్లో ఓటింగ్‌కు అవకాశం
- 1,523 మందికి ఈ నెల 7, 8 తేదీల్లో హోమ్ ఓటింగ్
- ఎంపీ ఎన్నికలకు 3 బ్యాలెట్ యూనిట్ల వినియోగం
- పొరుగు జిల్లాల నుంచి అదనపు ఈవీఎంలను రప్పిస్తున్నాం
- జిల్లా ఎన్నికల అధికారి మల్లికార్జున



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున, జాయింట్ సీపీ ఫకీరప్ప

సాక్షి, విశాఖపట్నం: పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో సమగ్ర ఏర్పాట్లు చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ ఓటరుకు ఏ మాత్రం అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పోలింగ్‌కు ముందే హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ పూర్తి చేయాల్సి ఉన్నందున.. ఈ నెల 5 నుంచి ఈ క్రతువు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్పతో కలిసి మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో డా.మల్లికార్జున కీలక అంశాలను వెల్లడించారు.

బరిలో 134 మంది అభ్యర్థులు

జిల్లాలో నామినేషన్ల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాం. పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియల అనంతరం విశాఖ లోక్‌సభ స్థానంలో 33 మంది, ఏడు అసెంబ్లీల బరిలో 101 మంది కలిపి మొత్తం 134 మంది పోటీలో ఉన్నారు. ఇందులో 114 మంది పురుష అభ్యర్థులుండగా.. 20 మంది మహిళా అభ్యర్థులు. పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్ కోసం కర్నూలు ప్రెస్‌కు కూడా వివరాలు పంపించాం. ఈ నెల 13న జరిగే పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ మేరకు పోలింగ్ పర్సనల్, మైక్రో అబ్జర్వర్లకు సంబంధించి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల పరిశీలకుల సమక్షంలో నిర్వహించాం.

7, 8, 9 తేదీల్లో హోం ఓటింగ్

జిల్లాలో 85 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, 40 శాతం అంగవైకల్యం పైబడిన వారికి ఈ నెల 7, 8వ తేదీల్లో హోం ఓటింగ్ నిర్వహిస్తాం. ఒక వేళ ఆ రెండు తేదీల్లో ఎవరైనా మిగిలిపోతే 9న మరోసారి అవకాశం కల్పిస్తాం. ఒక టీమ్‌లో మొత్తం ఏడుగురు అధికారులుంటారు. ఓ బీఎల్‌వో, గెజిటెడ్ అధికారితో పాటు మరో ఐదుగురు ఎన్నికల అధికారుల సమక్షంలో ఈ ఓటింగ్ నిర్వహిస్తాం. త్వరలోనే దీనికి సంబంధించిన రూట్ మ్యాప్‌ను విడుదల చేస్తాం. జిల్లాలో 1,523 మంది హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో ఈ ఓటింగ్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహిస్తాం. ఎన్నికల విధుల్లో భాగస్వామ్యమయ్యే అధికారులు, సిబ్బందికి ఈ నెల 5, 6, 7వ తేదీల్లో ఆంధ్రా యూనివర్సిటీలో నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రం ద్వారా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఉంటుంది. ఈ జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు 11,221 మంది ఫారం-12పై సంతకాలు చేశారు. ఈ జిల్లాలో ఎన్నికల విధుల్లో ఉంటూ.. ఇతర జిల్లాలో ఓటు హక్కు ఉన్న వారు 5,626 మంది కూడా ఫారం -12 అందించారు. 11,221 మంది ఈ నెల 5, 6, 7 తేదీల్లో ఏయూలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. 5, 6 తేదీలను పీవో, ఏపీవోలకు, 7న ఓపీవోలకు కేటాయించాం. 7, 8 తేదీల్లో పోలీస్, రవాణా, ఇతర ఎసెన్షియల్ సర్వీసెస్ విభాగాలకు చెందిన వారికి ఓటింగ్ ఉంటుంది.

రూ.13.41 కోట్ల నగదు జప్తు

420 మంది ఉద్యోగులతో కూడిన 110 ఎంసీసీ బృందాలు పటిష్టంగా పనిచేస్తున్నాయి. ఇప్పటి వరకు రూ.13.41 కోట్ల విలువైన నగదు, వస్తువులను సీజ్ చేశాం. ఇందులో రూ.3.54 కోట్ల నగదు, రూ.20 లక్షల లిక్కర్, రూ.29 లక్షల నార్కోటిక్స్, డ్రగ్స్, రూ.7.25 కోట్ల విలువైన మెటల్స్ సీజ్ చేశాం. ఎన్నికల్లో ప్రలోభాల కోసం తీసుకొచ్చిన కుక్కర్స్, క్రికెట్ కిట్స్, చీరలు మొదలైనవి రూ.2.11 కోట్ల వరకు సీజ్ చేశాం. నాన్ పొలిటికల్, ట్రేడర్స్, ఇతరులెవరికి సంబంధించిన నగదు, వస్తువులను సీజ్ చేసి ఉంటే.. కలెక్టరేట్‌లోని డిస్ట్రిక్ గ్రీవెన్స్ రెడ్రసల్ కమిటీ దగ్గర ఆధారాలు చూపిస్తే విడుదల చేస్తున్నాం. ఇలాంటి కేసులు 170 పరిష్కరించాం. ఒకటి ఐటీ పరిధిలోకి వెళ్లింది.

ఈవీఎంలు తీసుకొస్తున్నాం

విశాఖ పార్లమెంట్‌కు సంబంధించి 33 మంది అభ్యర్థులు బరిలో ఉన్న నేపథ్యంలో మూడు బ్యాలెట్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీన్ని అధిగమించేందుకు పొరుగు జిల్లాల్లో ఉన్న అదనపు ఈవీఎంలను పంపించాలని ఇప్పటికే ఆయా జిల్లా అధికారులను కోరాం. అవి వచ్చాక రాజకీయ పార్టీల సమక్షంలో పరిశీలించి వినియోగిస్తామని జిల్లా ఎన్నికల అధికారి వెల్లడించారు. జిల్లాలో చేపట్టిన ఎన్నికల భద్రత చర్యలను జాయింట్ కమిషనర్ ఫకీరప్ప వివరించారు. జిల్లాలో ఐదు చెక్ పోస్టుల ద్వారా నిత్యం తనిఖీ చేస్తున్నామన్నారు. సుమారు ఆరు వేల మంది పోలీసులు ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం అవుతున్నారని వెల్లడించారు.

28 మందిపై ఎఫ్ఐఆర్

సీవిజిల్ ద్వారా 562 ఫిర్యాదులందగా 417 కేసులను ఇప్పటి వరకు పరిష్కరించాం. 140 కేసులు ఎన్నికలకు సంబంధం లేని కారణంగా తిరస్కరించాం. నియమావళి ఉల్లంఘనకు సంబంధించి 82 ఘటనల్లో కేసులు నమోదు చేశాం. నిబంధనలు అతిక్రమించిన 71 ఉద్యోగులపై చర్యలు తీసుకున్నాం. 28 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాం. ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఘటనల్లో రాజకీయ పార్టీలపై 54 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశాం. ఇందులో టీడీపీ, జనసేన, బీజేపీపై 14, వైఎస్సార్ సీపీపై 18, ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులపై 22 కేసులు ఉన్నాయి. కంప్లైంట్ రిడ్రెస్సల్ సెల్ ద్వారా సాధారణ పౌరులకు సంబంధించిన 61 కేసుల్లో 57 కేసులను పరిష్కరించాం. సింగిల్ విండో డెస్క్ ద్వారా 351 దరఖాస్తులు రాగా 276కి నిర్ణీత కాలంలో అనుమతులు జారీ చేయగా... 53 ఇతర అంశాలకు సంబంధించినవి. మిగిలినవి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

పాయకరావుపేటకు నేడు సీఎం రాక



సాక్షి, అనకాపల్లి : ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పాయకరావుపేటకు వస్తున్నారు. పాయకరావుపేట సూర్యమహల్ జంక్షన్‌లో నిర్వహించే బహిరంగ సభలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. బహిరంగ సభ ఏర్పాట్లను మంగళవారం రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ, ఎంఎస్ఎంఈ చైర్మన్ డీవీ సూర్యనారాయణరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఉన్నారు.

సీఎం పర్యటన ఇలా..

సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం 9 గంటలకు తాడేపల్లిలో గల తన నివాసం నుంచి రోడ్డు మార్గం గుండా 9.20 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 9.30 గంటలకు విమానంలో బయలుదేరి 10.15 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి విజయనగరం జిల్లా బొబ్బిలికి చేరుకుని..అక్కడ బహిరంగ సభలో పాల్గొంటారు. అక్కడ నుంచి మధ్యాహ్నం 12.50 గంటలకు పాయకరావుపేటలో మంగవరం రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గాన బయలుదేరి 1.10 గంటలకు పాయకరావుపేట సూర్యమహల్ జంక్షన్ వద్ద నిర్వహించే బహిరంగ సభ వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల వరకూ బహిరంగ సభ జరుగుతుంది. అనంతరం 2.15 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకుని, 2.25 గంటలకు హెలికాప్టర్‌లో ఏలూరు వెళతారు.

సమ్మర్ హీట్.. 'కూల్' షెడ్

ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని నగర ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు జీవీఎంసీ వినూత్న చర్యలు చేపట్టింది. ఆర్టీసీ కాంప్లెక్స్ గురజాడ విగ్రహం వద్ద గ్రీన్‌షెడ్ ఏర్పాటు చేసింది. స్ప్రింకర్లను అమర్చింది. మండుటెండల్లో ప్రయాణించే వాహనచోదకులపై సన్నటి నీటి తుంపర్లు పడి సేదదీరుస్తాయి. ఇందులో లోటు



పాట్లు, ప్రజా స్పందన దృష్టిలో పెట్టుకుని మిగతా ప్రాంతాల్లోని ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేయనున్నారు. - డాబాగార్డెన్స్



వైఎస్సార్‌సీపీలోకి 150 కుటుంబాలు



పార్టీలో చేరిన 98వ వార్డు టీడీపీ, జనసేన కుటుంబాలతో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆహ్వానించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అడవివరంలోని విజినిగిరిపాలెం, లండగరువు ప్రాంతాలకు చెందిన 150 టీడీపీ, జనసేన కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును వారంతా నగరంలో మంగళవారం కలిసి తమ మద్దతు తెలియజేశారు. వారికి వైఎస్సార్‌సీపీ కండువాలను ముత్తంశెట్టి కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారంతా జై జగన్...జై ముత్తంశెట్టి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భీమిలి నుంచి తనను, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. విజినిగిరిపాలేనికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, కోరాడ ఈశ్వరరావు, నాయకుడు విజినిగిరి కృష్ణ, ఎస్సీకాలనీ నాయకుడు పి.వరహాలు, జనసేన నాయకుడు మజ్జి సాయి కిరణ్ ఆధ్వర్యంలో విజినిగిరిపాలేనికి చెందిన కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. అలాగే లండగరువుకు చెందిన లండ శీతం నాయుడు, లండ సూరిబాబు, లండ రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఆ ప్రాంతం వారు చేరారు. వైఎస్సార్‌సీపీ 98వవార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, నాయకుడు ఎస్.అప్పారావు, టి.రాము తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట భద్రత

- నగరంలో నిరంతర నిఘా పెట్టాలి
- పోలింగ్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- నేర సమీక్ష సమావేశంలో సీపీ రవిశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రవిశంకర్

విశాఖ సిటీ : సార్వత్రిక ఎన్నికలకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పోలీస్ సమావేశ మందిరంలో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలతో పాటు ఈనెల 10న నిర్వహించనున్న చందనోత్సవంపై ప్రత్యేకంగా చర్చించారు. ట్రాఫిక్, క్రైమ్, లా అండ్ ఆర్డర్, స్పెషల్ బ్రాంచ్‌లకు వేర్వేరుగా నిర్వహించిన సమావేశంలో ఆయా విభాగాల పనితీరును సీపీ సమీక్షించారు.

- ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పోలింగ్ ప్రాంతాలు, కేంద్రాల్లో ఏర్పాటు చేసే బందోబస్తు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, ఎంసీసీ బృందాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద తీసుకోవాల్సిన ఏర్పాట్లపై సూచనలు చేశారు.
- ఇతర ప్రదేశాల నుంచి వచ్చిన సిబ్బందికి వసతి ఏర్పాట్లు కల్పించాలన్నారు.
- క్రిటికల్ పోలింగ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసే బందోబస్తు, సెన్సిటివ్ ప్రదేశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదేశాలు జారీ చేశారు.
- ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు తీరును సమీక్షించి శత శాతం మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలయ్యేలా విధులు నిర్వహించాలని చెప్పారు.
- చెక్ పోస్టుల పనితీరు సమీక్షిస్తూ.. ఇప్పటివరకు సీజ్ చేసిన వివరాలను పరిశీలించారు. అక్రమ మద్యం, నగదు, ఇతర అనుమానిత వస్తువులను పూర్తిగా నివారించేలా అన్ని వాహనాలను నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు.
- పోలీస్ స్టేషన్ల పరిధిలో బైండోవర్ చేసిన రౌడీషీటర్స్‌పై పూర్తి నిఘా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు వారి హాజరును, ప్రవర్తనను తనిఖీ చేయాలని సూచించారు. పోలింగ్, కౌంటింగ్ జరిగే రోజుల్లో వారిపై పూర్తి నిఘా ఉంచి, రోడ్లపై ఉండకుండా చూడాలన్నారు.
- అన్ని ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.
- అన్ని పోలీస్‌స్టేషన్లలో కేసుల నమోదు, అధికారులు ఫిర్యాదుదారులతో ప్రవర్తిస్తున్న తీరుపై ఆరా తీసి పలు సూచనలు చేశారు.
- మహిళలపై వేధింపులు, మహిళ మిస్సింగ్ సంబంధిత కేసుల్లో జాప్యం లేకుండా తక్షణమే స్పందించి ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంలో వారితో వ్యవహరించాలన్నారు. పోక్సో కేసులపై ఆరా తీశారు.
- నగరంలో క్రైమ్ రేటు తగ్గుముఖం పట్టేలా రాత్రి పూట నిఘా మరింత పటిష్టం చేయాలన్నారు. రాత్రి విధులు నిర్వహించే ప్రతి ఒక్కరూ ట్యాబ్ తీసుకొని, తమ లొకేషన్ తెలిసే విధంగా ఉండాలని చెప్పారు.
- నగర పోలీస్ నిఘా వర్గాలు అక్రమ నగదు, మద్యం ఇతర ప్రలోభాలపైనే కాకుండా నగరంలో పూర్తి నిఘా పెట్టి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పూర్తి నిబద్ధతతో ఉండాలన్నారు.
- నిన్నటి వరకూ నమోదు చేసిన ఎన్‌డీపీఎస్ కేసు వివరాలను సమీక్షించారు. ఎన్నికల విధులు నిర్వర్తిస్తూనే నగరం నుంచి మత్తు పదార్థాలు రవాణా జరగకుండా పూర్తిగా నిరోధించాలని ఆదేశించారు.
- సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసే చర్యలపై చర్చించారు. పలు కొత్త సాఫ్ట్‌వేర్‌లను తీసుకొని వినియోగించాలని.. సిబ్బందికి, అధికారులకు వాటిపై పూర్తి అవగాహనకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు.
- పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసు వివరాలపై ఆరా తీశారు. అందుకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వాటిని సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.
- ముద్దాయిలపై ఉన్న ఎన్‌బీడబ్ల్యూ వారెంట్లను నిర్ణీత సమయంలో పూర్తిగా విచారణ చేసి వాటిని పరిష్కరించి, మూసి వేయాలన్నారు.



వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి ఆనంద్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలుపొందాలని ఆల్ ద బెస్ట్ చెబుతూ గ్రీటింగ్ కార్డు అందజేస్తున్న నాగేంద్రకాలనీ చిన్నారులు. - గోపాలపట్నం



సింహగిరికాలనీలో వైఎస్సార్ సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి, కార్పొరేటర్ కంపా హనోకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న యాంకర్ శ్యామల - తాటిచెట్లపాలెం



జీవీఎంసీ 12వ వార్డులో మహిళకు కరపత్రం ఇచ్చి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ - ఆరిలోవ



ఏపీఎన్ కాలేజ్ డౌన్ రోడ్డులో టైలరింగ్ చేస్తూ వినూత్న ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ - డాబాగార్డెన్స్



కస్తూరినగర్-1లో వృద్ధురాలి దీవెనలు అందుకుంటున్న వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు - కంచరపాలెం

ప్రచార పర్వం





తన అభిమాన నేత ఆదారి ఆనంద్ కుమార్ పచ్చబొట్టు వేసుకున్నాడు అడర్‌నగర్‌కు చెందిన బైక్ మెకానిక్ అనిల్‌కుమార్. మల్కాపురం పుడా లేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌కుమార్‌ను మంగళవారం కలిసి.. ఆయనంటే ఎందుకు అభిమానమో వెల్లడించాడు. ప్రజలకు నిస్వార్థంగా సేవా చేసే ఆనంద్ కుమార్ అంటే తనకిష్టమని, ఆయన గెలుపునకు కృషి చేస్తానని అనిల్ చెప్పాడు. అనిల్ అభిమానాన్ని జీవితాంతం గుర్తుంచుకుంటానని ఆనంద్‌కుమార్ తెలిపారు. - గోపాలపట్నం



చిన్నారి భవిష్యత్తు మాదే భరోసా.. 66వ వార్డులో చిన్నారిని లాలిస్తున్న వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్ - గాజువాక



జీవీఎంసీ 97వ వార్డులో ఓటు వేయమని మహిళను అభ్యర్థిస్తున్న వైఎస్సార్ సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అదీప్‌రాజ్ - పెందుర్తి



పెదగంట్యాడ మండలంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కె.ఎ.పాల్ - పెదగంట్యాడ

హ్యాపీ..హ్యాపీ



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ అగ్రతాంబూలం

- ప్రభుత్వంలో సామాజిక న్యాయం
- దళిత, వెనుకబడిన వర్గాలకు జగన్ పట్టం
- మంత్రుల నుంచి ఆలయ కమిటీల వరకు అన్నింటా ప్రతినిధ్యం
- అణగారిన వర్గాలకు 70 శాతానికి పైగా పదవులు కల్పించిన సీఎం జగన్

విశాఖ సిటీ: ఎస్సీలలో పుట్టాలని ఎవరైనా అనుకుంటారా? అని చంద్రబాబు వారిపై అక్కసు వెళ్లగక్కితే.. సీఎం జగన్ వారికి రాజకీయ పదవులు ఇచ్చి అక్కున చేర్చుకున్నారు. బర్రెలు, గొర్రెలు కాసుకొనే వారికి రాజకీయాలు ఎందుకని చంద్రబాబు వెనుకబడిన వర్గాలను అవమానిస్తే.. జగన్ వారికి ప్రభుత్వంలో ప్రతినిధ్యం కల్పించారు. జాత్యాహంకారంతో బడుగు, బలహీన వర్గాల వారిని చంద్రబాబు చిన్నచూపు చూడగా.. జగన్ వారికి సంపూర్ణ రాజ్యాధికారం కల్పించి పట్టం కట్టారు. స్వాతంత్య్రం వచ్చిన నాటి నుంచి పాలక పార్టీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగానే చూడగా.. మొట్టమొదటి సారిగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వారికి రాజకీయంగా సముచిత స్థానం కల్పించింది. మంత్రి పదవుల నుంచి ఆలయ కమిటీల వరకు అన్నింట్లోను 70 శాతం పదవులు కట్టబెట్టింది. రాష్ట్రంలోనే కాకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలో సైతం అణగారిన వర్గాల వారికి రాజకీయంగా ఉన్నత పదవులు అందించి సమున్నత స్థానంలో కూర్చోబెట్టింది.

చంద్రబాబు కుటిల ప్రయత్నాలు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు కల్లబొల్లి మాటలు చెప్పి తమ వైపునకు తిప్పుకోడానికి తెలుగుదేశం పార్టీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటి వరకు చంద్రబాబు మూడు పర్యాయాలు ముఖ్యమంత్రి చేశారు. ఎప్పుడూ ఈ అణగారిన వర్గాలను పట్టించుకోని చంద్రబాబు ఈ సారి ఎన్నికల్లో సైతం వీరిని ఓటు బ్యాంకులుగా మార్చుకునే పన్నాగంలో నిమగ్నమయ్యారు. చంద్రబాబు 45 ఏళ్ల రాజకీయ జీవితంలో గుర్తుకురాని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై బూటకపు వరాలు కురిపించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక వైపు మతతత్వ పార్టీలతో జతకట్టి.. మైనార్టీలు తమవైపే ఉన్నారంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే 2019 ఎన్నికలకు ముందు మాట ఇచ్చిన విధంగా బడుగు, బలహీన వర్గాలకు పెద్ద పీట వేసిన జగన్.. వచ్చే ఎన్నికల్లో సైతం వారికి మరింత మేలు జరిగేలా దృష్టి పెట్టారు. వచ్చే ఎన్నికల్లో సైతం మెజార్టీ స్థానాలను వారికే కేటాయించారు. మరోసారి వారికి రాజ్యాధికారంలో భాగస్వాములను చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

రాజకీయంగా.. ఆర్థికంగా..

నా ఎస్సీ.. నా ఎస్టీ.. నా బీసీ.. నా మైనార్టీ.. ఇదీ ప్రతి ప్రసంగంలోను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న నినాదం.. కేవలం మాటలకే పరిమితమవలేదు. వారందరికీ రాజ్యాధికారంలో భాగస్వాములను చేశారు. చంద్రబాబు అక్కసు వెళ్లగక్కిన బడుగు, బలహీన వర్గాలను జగన్ గుండెల్లో పెట్టుకున్నారు. ఒకవైపు పేద, సామాన్యులకు సంక్షేమ పథకాలతో ఆర్థిక చేయూత అందిస్తూనే.. మరోవైపు వారిలో కొందరికి రాజకీయంగా పదవులు అందించి సామాజిక న్యాయం దిశగా అడుగులు వేస్తున్నారు.

జిల్లాలో 70 శాతానికి పైగా పదవులు

రాష్ట్రంలోనే కాకుండా ఉమ్మడి విశాఖ జిల్లాలో సైతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రతి నియోజకవర్గంలోను 70 శాతానికి పైగా పదవులు ఈ వర్గాలకు కేటాయించింది. సామాజిక సాధికార బస్సు యాత్ర ద్వారా ఈ విషయాన్ని సుస్పష్టమైంది. 2019 ఎన్నికల్లో సైతం 10 అసెంబ్లీ స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారు. ఇందులో బీసీ వర్గానికి చెందిన బూడి ముత్యాలనాయుడును డిప్యూటీ సీఎంగా కూడా చేశారు. ప్రభుత్వంలోనే కాకుండా నామినేటెడ్ పదవుల్లో సైతం అణగారిన వర్గాలకే సీఎం జగన్ ప్రాధాన్యత కల్పించారు. ఆలయ, మార్కెటింగ్ కమిటీల్లో సైతం అత్యధిక పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీలకే కేటాయించారు. ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంబా రవిబాబు, రెల్లి కమిషన్ చైర్మన్‌గా వడ్డాది మధుసూధనరావు, బీసీ వర్గానికి చెందిన మత్స్యకారుడు కోలా గురువులుకు మత్స్య కార్పొరేషన్ చైర్మన్‌గా, అనంతరం డీసీసీబీ చైర్‌పర్సన్‌తో పాటు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించారు. అలాగే క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్‌గా జాన్ వెస్లీ, డీసీఎంఎస్ చైర్‌పర్సన్‌గా పల్లా చినతల్లి, డీసీసీబీ చైర్‌పర్సన్‌గా చింతకాయల అనితకు అవకాశం కల్పించారు. అదే విధంగా గవర, యాత, నగరాలు, పట్నాయక్ ఇలా అనేక కార్పొరేషన్లకు చైర్మన్లుగా విశాఖకు చెందిన వారికే అవకాశం కల్పించారు. ఇటీవలే వీఎంఆర్‌డీఏ చైర్మన్‌గా బీసీ వర్గానికి చెందిన సనపల చంద్రమౌళిని నియమించారు. అలాగే ఒక్కో నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సంబంధించిన కార్పొరేషన్లకు సుమారు 70 మంది వరకు డైరెక్టర్లు ఉన్నారు. ఒకవైపు ప్రభుత్వ, నామినేటెడ్ పదవులతో పాటు, పార్టీ బాధ్యతల్లో కూడా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాలకు సమున్నత స్థానం కల్పించారు.

దివ్యాంగుల క్రికెట్ టోర్నీ విజేత సెంట్రల్ జోన్



విజేతగా నిలిచిన సెంట్రల్ జోన్ జట్టు

విశాఖ స్పోర్ట్స్: స్టేట్ అంతర జోన్ స్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నీలో సెంట్రల్ జోన్ బ్లాస్టర్స్ జట్టు విజేతగా నిలిచింది. సౌత్‌జోన్ రాయల్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది. రెండు రోజుల పాటు జరిగిన ఈ టోర్నీలో మూడు జట్లు పోటీ పడగా.. మంగళవారం వైఎస్ఆర్ స్టేడియంలో సెంట్రల్ జోన్ బ్లాస్టర్స్ జట్టు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఈ మేరకు తొలుత బ్యాటింగ్ చేసిన సౌత్‌జోన్ రాయల్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లకు 176 పరుగులు చేసింది. ప్రతిగా సెంట్రల్ జోన్ జట్టు 17.4 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసి విజయం సాధించింది. అంజాద్ 74, అఖిల్ 49, కిషోర్‌బాబు 46 పరుగులతో రాణించారు. పోటీల ముగింపు కార్యక్రమానికి ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ రెడ్డి హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడటంతో పాటు క్రమశిక్షణ, నిబద్ధత ఉన్నవారే క్రికెట్‌లో రాణిస్తారన్నారు. సంఘం అధ్యక్షుడు శరత్‌చంద్ర రెడ్డి నాయకత్వంలో అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహక కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కోరం లేక జెడ్పీ సమావేశం వాయిదా

మహారాణిపేట: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడింది. మంగళవారం ఉదయం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం, వివిధ స్థాయీ సంఘాల సమావేశాలు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహించారు. నిబంధనల ప్రకారం 90 రోజుల వ్యవధిలో సర్వసభ్య సమావేశం, స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహించాలి. అందులో భాగంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉండడం వల్ల దానికి లోబడి సమావేశం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. అయితే సభ్యులు అతి తక్కువ మంది హాజరయ్యారు. దీంతో కోరం లేని కారణంగా సమావేశాలు వాయిదా వేసినట్టు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.పోలినాయుడు తెలిపారు.

రాజన్న రాజ్యం జగన్‌తోనే సాధ్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గొంపా గోవింద్‌రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాజన్న రాజ్యం సాధ్యమని, ఆయన ప్రభుత్వ విధానాలు నచ్చి వైఎస్సార్‌సీపీలో చేరామని గొంప గోవింద్‌రాజు, కమలాకర్ రావు తెలిపారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్ సీపీ ఉత్తర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి సారథ్యంలో తాము పనిచేశామని, అప్పుడు ప్రజా సంక్షేమ పాలన మొదలైందన్నారు. రాజన్న తనయుడు వైఎస్ జగన్ తండ్రి ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. సీఎం జగన్ అమలు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సారథ్యంలో పనిచేయాలని తాము నిర్ణయించుకున్నామని చెప్పారు. ఈ ఎన్నికల్లో కె.కె.రాజును అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు.

షర్మిలకు సొంత ప్రయోజనాలే ముఖ్యం..

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల పిచ్చిపట్టినట్లు మాట్లాడుతున్నారని గొంప గోవింద్‌రాజు అన్నారు. నగరంలో కూలిపోతున్న కాంగ్రెస్ పార్టీని తాను బాగు చేసి, నూతన భవనాన్ని నిర్మించానని తెలిపారు. ప్రజల సంక్షేమం కన్నా.. సొంత ప్రయోజనాలే షర్మిలకు ముఖ్యమని, పార్టీ నాయకులను ఆమె పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వుడా మాజీ చైర్మన్ రవిరాజు, మాజీ కార్పొరేటర్ జి.వి.రవిరాజు, గొంప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పవన్ పర్యటన

సాక్షి, విశాఖపట్నం: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ బుధవారం ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎన్నికల పర్యటన చేయనున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గంలోని అచ్యుతాపురంలో ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. అనంతరం రాత్రి ఏడు గంటలకు విశాఖ జిల్లా పెందుర్తి జంక్షన్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

సత్తా చాటిన విశాఖ అథ్లెట్



సరోజిని

విశాఖ స్పోర్ట్స్: నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్‌లో విశాఖ మాస్టర్ అథ్లెట్ సత్తా చాటింది. ఏపీ తరఫున పాల్గొన్న డి.సరోజని 200 మీటర్ల పరుగులో స్వర్ణ పతకం దక్కించుకుంది. 400 మీటర్ల పరుగు, 5 కిలోమీటర్ల నడకలో రజత పతకాలు సాధించింది. ఈ పోటీలు మహారాష్ట్రలోని ముంబైలో గత నెల 26 నుంచి మూడు రోజుల పాటు జరిగాయి.

వేసవి శిబిరాలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: వైఎంసీఏ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు కొనసాగే ఈ శిబిరాలకు వైఎంసీఏ సౌత్ ఈస్ట్ చైర్మన్ రోనాల్డ్ విలియమ్స్ శ్రీకారం చుట్టారు. వైఎంసీఏ అధ్యక్షుడు కృపాధాన్ కుమార్ మాట్లాడుతూ 5 నుంచి 15 ఏళ్ల బాల బాలికలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 0891-2755826లో సంప్రదించవచ్చు.

పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి



ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపడుతున్న కలెక్టర్

మహారాణిపేట : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయింది. ఈ మేరకు నియోజకవర్గ సాధారణ పరిశీలకులు అమిత్‌శర్మ, గాజువాక, పశ్చిమ, ఎస్.కోట అసెంబ్లీ నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు సీతారామ్ జాట్ సమక్షంలో కలెక్టర్ మల్లికార్జున మంగళవారం కలెక్టరేట్ వీసీ హాల్లో ఆన్‌లైన్ విధానంలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అనుసరిస్తూ 12,626 మందికి విధులు కేటాయించారు. సంబంధిత నమూనా ఆర్డర్ కాపీలను పరిశీలకులకు చూపించారు. జిల్లాలో మొత్తం 1991 పోలింగ్ కేంద్రాలుండగా 2,184 మంది పీవోలను, 2,193 మంది ఏపీవోలను కేటాయిస్తూ మంగళవారం ర్యాండమైజేషన్ నిర్వహించారు. భీమిలిలో 359, తూర్పులో 29 3, దక్షిణలో 237, ఉత్తరలో 275, పశ్చిమలో 222, గాజువాకలో 306, పెందుర్తిలో 299 పోలింగ్ కేంద్రాలుండగా అదే సంఖ్యను అనుసరిస్తూ పీవోలను, ఏపీవోలను కేటాయించారు. 800లోపు ఓటర్లున్న చోట కేంద్రానికి ముగ్గురు, 800 దాటిన చోట కేంద్రానికి నలుగురు చొప్పున ఓపీవోలను కేటాయిస్తూ రెండో విడత ర్యాండమైజేషన్ పూర్తి చేశారు. 5, 6 తేదీల్లో నిర్దేశించిన ప్రాంతాల్లో శిక్షణ ఉంటుందని, ఎన్నికల విధులకు కేటాయింపు జరిగిన వారంతా శిక్షణ శిబిరాలకు హాజరు కావాలని కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. జేసీ కె. మయూర్ అశోక్, డీఆర్వో కె. మోహన్‌కుమార్, ఎన్.ఐ.సి. అధికారులు చంద్రశేఖర్, పాషా పాల్గొన్నారు.

'దక్షిణ'లో ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గంలో ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తయినట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. చినగదిలిలోని ఈవీఎంల గోదాముల వద్ద వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధుల సమక్షంలో సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. దక్షిణ బరిలో 16 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని, రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరమని ఎన్నికల అధికారులు నిర్ణయించారు. 12, 13 తేదీల్లో నిర్వహించిన మొదటి ర్యాండమైజేషన్‌లో ప్రతి పోలింగ్ స్టేషన్‌కు ఒక బ్యాలెట్ యూనిట్ అవసరమని ముందుగా భావించారు. ప్రస్తుతం దక్షిణంలో రెండు బ్యాలెట్ యూనిట్లు అవసరం కానుండడంతో 20 శాతం రిజర్వ్‌తో కలిపి 284 బ్యాలెట్ యూనిట్లు అవసరమని గుర్తించారు. ఇందుకు సంబంధించి చినగదిలి ఈవీఎం గోదాముల్లో రిజర్వ్‌లో ఉంచిన బ్యాలెట్ యూనిట్ల నుంచి దక్షిణ నియోజకవర్గానికి అవసరమైన ఈవీఎంలు పొందేందుకు సప్లిమెంటరీ ర్యాండమైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంల నోడల్ అధికారి టి. ప్రవీణ, వివిధ పార్టీల అభ్యర్థులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌ను అనర్హుడిగా ప్రకటించండి

- వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఎన్నికల సమావేశం నియమావళికి విరుద్ధం
- డీఆర్వోకు వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగం ఫిర్యాదు



డీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగం ఉపాధ్యక్షుడు నీలాపు కాళిదాసు రెడ్డి, రవిరెడ్డి

మహారాణిపేట: సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్ ముస్లింలతో సమావేశం నిర్వహించడం ఎన్నికల నియామవళికి విరుద్ధమని, తక్షణమే అతన్ని అనర్హుడిగా ప్రకటించాలని వైఎస్సార్‌సీపీ న్యాయ విభాగం ఉపాధ్యక్షుడు నీలాపు కాళిదాసు రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డితో కలిసి డీఆర్వో కె.మోహన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ సంస్థ, స్థలంలో రాజకీయ పార్టీలు సమావేశం నిర్వహించడం ఎన్నికల నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. ముస్లిం సామాజిక వర్గంతో నిర్వహించిన సమావేశంలో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రసంగాలు చేసిన శ్రీభరత్‌ను అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అనుమతి ఇవ్వడంపై విమర్శలు

ఎం.శ్రీభరత్‌కు వీఎంఆర్‌డీఏ అధికారులు ఏ తరహాలో అనుమతి ఇచ్చారన్న దానిపై విమర్శలు వస్తున్నాయని కాళిదాసు రెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేస్తున్న అభ్యర్థికి పూర్తి వివరాలు తెలుసుకోకుండా ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు.

ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లు

తాటిచెట్లపాలెం : వేసవి రద్దీ దృష్ట్యా ప్రయాణికుల కోసం ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

◆ సంబల్‌పూర్ – ఎస్ఎంవీ బెంగళూరు (08321) సమ్మర్ స్పెషల్ సంబల్‌పూర్‌లో ఈ నెల 9, 16న ప్రతీ గురువారం సాయంత్రం 6.45 గంటలకు బయల్దేరి మరుసటి రోజు తెల్లవారుజామున 4.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 5 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 11.30 గంటలకు ఎస్ఎంవీ బెంగళూరు వెళ్తుంది. ఎస్ఎంవీ బెంగళూరు – సంబల్‌పూర్ (08322) స్పెషల్ మే 11, 18న శనివారం తెల్లవారుజామున 1.30 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 8.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 8.35 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 6.30 గంటలకు సంబల్‌పూర్ వెళ్తుంది. ◆ సూరత్ – బ్రహ్మపూర్ (09069) స్పెషల్ సూరత్‌లో ప్రతీ బుధవారం మధ్యాహ్నం 2.20 గంటలకు బయల్దేరి మరుసటి రోజు సాయంత్రం 4.15 గంటలకు విజయనగరం చేరుకుంటుంది. అక్కడి నుంచి 4.40 గంటలకు బయల్దేరి గురువారం రాత్రి 8.15 గంటలకు బ్రహ్మపూర్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు జూన్ 26 వరకు నడుస్తుంది. బ్రహ్మపూర్ – సూరత్ (09070) స్పెషల్ బ్రహ్మపూర్‌లో ప్రతీ గురువారం రాత్రి 10 గంటలకు బయల్దేరి శుక్రవారం తెల్లవారుజామున 1.05 గంటలకు విజయనగరం చేరుకుంటుంది. అక్కడి నుంచి 1.30 గంటలకు బయల్దేరి శనివారం ఉదయం 6.30 గంటలకు సూరత్ వెళ్తుంది.

భద్రతా పనుల నిమిత్తం రైళ్ల దారి మళ్లింపు

సదరన్ రైల్వే, సేలం డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఓ ప్రకటనలో తెలిపారు.

◆ మే 10న బయల్దేరే డిబ్రూగఢ్ – కన్యాకుమారి (22504) ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా మళ్లించిన మార్గంలో వయా ఇరుగుర్ – పోదనూర్ – సురత్కల్ మీదుగా నడుస్తుంది. ◆ మే 7, 9, 13న బయల్దేరే ఎర్నాకుళం టాటానగర్ (18190) ఎక్స్‌ప్రెస్ వయా కోయంబత్తూర్ మీదుగా నడుస్తుంది.

మత్తు ఇంజక్షన్ల అక్రమ విక్రయంపై దర్యాప్తు

ఎంవీపీ కాలనీ: నగరంలో మత్తు ఇంజక్షన్ల అక్రమ విక్రయాల వ్యవహారంపై నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సోమవారం రాత్రి నగరంలోని ఎంవీపీ కాలనీ పోలీసు స్టేషన్ పరిధిలో 490 మత్తు ఇంజక్షన్లు స్వాధీనం చేసుకుని, వాటిని విక్రయిస్తున్న వ్యక్తిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఇంజక్షన్లను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.. ఎవరినీ టార్గెట్ చేస్తూ విక్రయాలు చేస్తున్నారు.. అనే విషయంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడిన ఇంజక్షన్లలో డ్రగ్ శాతం ఎంత, అవి అనుమతులకు లోబడి తయారయ్యాయా? లేదా? అనే విషయంపైనా డ్రగ్ ఎక్స్‌పర్ట్స్ పరిశీలిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటి వరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని, దర్యాప్తు కొనసాగుతుందని ఎంవీపీ పోలీసులు తెలిపారు.

డయల్ యువర్ సీపీకి 37 ఫిర్యాదులు

విశాఖ సిటీ: డయల్ యువర్ సీపీ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరం చట్టప్రకారం పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు సీపీ తన చాంబర్ నుంచి డయల్ యువర్ సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 37 మంది కాలర్స్ ఫోన్ చేసి తమ సమస్యలను సీపీకి విన్నవించారు. వారి ఫిర్యాదులు విన్న సీపీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని వెంటనే పరిష్కరించాలని చెప్పారు. అలాగే మధ్యాహ్నం 12 నుంచి 12.30 వరకు వృద్ధుల కోసం కేటాయించిన సమయంలో 8 ఫిర్యాదులు వచ్చాయి. గత 15వ తేదీన నిర్వహించిన డయల్ యువర్ సీపీకి 37 ఫిర్యాదులు రాగా.. వాటిలో 29 పరిష్కరించారు. 8 ఫిర్యాదులు పరిష్కార దశలో ఉన్నాయి. వృద్ధులకు సంబంధించి 8 ఫిర్యాదులకు గాను అన్నింటినీ సీపీ ప్రత్యేక చొరవతో పరిష్కరించారు.